# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 02-07-2024 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ దేశ ప్రజలకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము మార్గదర్శనం చేశారని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పేర్కొన్నారు.
- ❖ నిర్మాణ రంగానికి ఇసుక కొరత లేకుండా తక్షణ చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు.
- ❖ రాష్ట్ర ప్రభుత్వం ఆడపిల్లల భద్రతపై ప్రత్యేక దృష్టి సారిస్తోందని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ వెల్లడించారు.
- ❖ రాష్ట్రంలో ఐఏఎస్ అధికారుల్ని బదిలీ చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ ఈరోజు ఉత్తర్వులు జారీ చేశారు.

==============================

దేశ ప్రజలకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము మార్గదర్శనం చేశారని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పేర్కొన్నారు. గత శుక్రవారం ఉభయ సభలను ఉద్దేశించి చేసిన రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానంలో భాగంగా ఈరోజు లోక్‌సభలో నరేంద్రమోదీ మాట్లాడుతూ... దేశ ప్రజలంతా ఇటీవల ఎన్నికల్లో పరిపక్వతతో తీర్పునిచ్చారని అన్నారు. గత పదేళ్లలో అవినీతిరహిత పాలన అందించామని, ప్రపంచ దేశాల్లో భారత దేశ ప్రతిష్ఠ మరింత పెరిగిందన్నారు. "భారత్ ప్రథమ్" అనే విధానాన్ని మరింత ముందుకు తీసుకువెళ్తామన్నారు. కాగా రేపు రాజ్యసభలో ధన్యవాద తీర్మాణంలో భాగంగా ప్రధానమంత్రి ప్రసంగించనున్నారు. రేపటితో పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు ముగియనున్నాయి.

==============================

రాష్ట్రంలో ఇసుక లభ్యత, నూతన ఇసుక పాలసీ, దెబ్బతిన్న రహదారులు, నిత్యావసర వస్తువుల ధరల నియంత్రణపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు అమరావతిలోని సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. అనంతరం ముఖ్యమంత్రి మాట్లాడుతూ... తక్షణం నిర్మాణ రంగానికి అత్యవసరమైన ఇసుకను అందుబాటులోకి తేవడానికి చర్యలు

తీసుకోవాలని, రాష్ట్రంలో నిర్మాణాలకు ఇసుక కొరత లేకుండా చూడాలన్నారు. అదే విధంగా రాష్ట్ర వ్యాప్తంగా పూర్తి స్థాయిలో రహదారులను బాగు చేయడం ఒక విధానం అయితే... తక్షణం ప్రజల కష్టాలు తీర్చేందుకు రహదారులపై గుంతలు పూడ్చడం, వెంటనే మరమ్మతులు చేయాల్సిన రోడ్లపై దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. ఎన్ని కిలోమీటర్ల మేర రహదారులు.. ఏ మేర దెబ్బతిన్నాయి అనే విషయంలో సత్వరమే నివేదికలు సిద్ధం చేయాలన్నారు. డిమాండ్ కు సరిపడా సరఫరా లేక కంది పప్పు, టమోటా, ఉల్లిపాయల ధరలు ఒక్కోసారి అనూహ్యంగా పెరగడం వల్ల ప్రజలపై భారం పడుతోందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ధరల నియంత్రణకు ఏ చర్యలు తీసుకోవాలనే దానిపై ప్రణాళిక సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. ఈ సమీక్షల్లో మంత్రులు కొల్లు రవీంద్ర, బీసీ జనార్ధన్ రెడ్డి, కె.అచ్చెన్నాయుడు, నాదెండ్ల మనోహర్ తో పాటు ఆయా శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

కాకినాడ కలెక్టరేట్ లో ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ శాఖల వారీగా ఈరోజు సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో పీడబ్ల్యుఎస్ పథకాల అమలు, గ్రామీణ స్థాయిలో మంచినీటి పరీక్షలు, మంచినీటి ట్యాంకుల క్లోరినేషన్, జలజీవన్ మిషన్ పనులు తదితర అంశాలపై క్షేత్రస్థాయిలో ప్రస్తుత పరిస్థితిని ఉపముఖ్యమంత్రి అధికారులను అడిగి తెలుసుకొన్నారు. అనంతరం పాత్రికేయులతో మాట్లాడుతూ... ఉప్పాడ తీరం కోతకు గురవుతున్న నేపథ్యంలో దాన్ని ఎలా రక్షించుకోవాలనే అంశంపై క్షేత్రస్థాయిలో పర్యటించి వివరాలు తెలుసుకుంటానని, అలాగే తీరం కోత గురించి నిపుణుల బృందం కూడా అధ్యయనం చేస్తుందని తెలిపారు. కాగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆడపిల్లల భద్రతపై ప్రత్యేక దృష్టి సారిస్తోందని పవన్ కళ్యాణ్ ఉద్ఘాటించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

రాష్ట్రంలో ఐఏఎస్ అధికారులు బదిలీ చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ ఈరోజు ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో భాగంగా విశాఖ జిల్లా నూతన కలెక్టర్‌గా హరేంద్ర ప్రసాద్, శ్రీకాకుళంకు స్వప్నిల్ దినకర్, పార్వతీపురం మన్యంకు - శ్యామ్ ప్రసాద్, అనకాపల్లికి కె. విజయ, అంబేడ్కర్ కోనసీమ జిల్లాకు రావిరాల మహేశ్ కుమార్ ను నియమిస్తూ... ఉత్తర్వులు జారీ చేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశానికి సేవ చేయడమే పార్లమెంట్ సభ్యులందరి మొదటి బాధ్యతని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. నరేంద్రమోదీ నేతృత్వంలో వరుసగా మూడవసారి కేంద్రంలో ఎన్‌డీఏ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తొలిసారి ఎన్‌డీఏ పార్లమెంటరీ పార్టీ సమావేశం నిర్వహించారు. నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పార్లమెంట్ సభ్యులకు ప్రధానమంత్రి కీలక సూచనలు చేశారని పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు తెలిపారు. ప్రతి ఎంపీ దేశానికి తొలి ప్రాధాన్యమిస్తూ పని చేయాలని, నియోజకవర్గానికి సంబంధించిన అంశాలపై ఎంపీలు అవగాహన పెంచుకోవాలని మోదీ దిశా నిర్దేశం చేశారని వెల్లడించారు. మంచి ఎంపీగా ఎదగడానికి అవసరమైన పార్లమెంట్ నియమాలు, ప్రజాస్వామ్య వ్యవస్థ, ప్రవర్తనను అనుసరించాలని ఎన్డీఏ ఎంపీలను ప్రధాని మోదీ కోరారని కేంద్రమంత్రి కిరణ్ రిజిజు తెలిపారు. ఎంపీలందరూ నియోజకవర్గ ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉండాలని నరేంద్ర మోదీ సూచనలు చేసినట్లు కేంద్రమంత్రి వెల్లడించారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

విశాఖపట్నం జిల్లా ఆడవివరంలోని కేంద్ర కారాగారాన్ని రాష్ట్ర హోం శాఖా మంత్రి వంగలపూడి అనిత ఈరోజు సందర్శించారు. అక్కడి పరిస్థితులను, ఖైదీలు, సిబ్బంది కష్టాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పాత్రికేయులతో మాట్లాడుతూ... గంజాయి రవాణా కేసుల్లో అసలు సూత్రధారులుకు బదులుగా డబ్బులకు ఆశపడిన అమాయక గిరిజన యువత కారాగారంలో రిమాండ్ ఖైదీలుగా ఉండటం బాధాకరమన్నారు. గంజాయి డీ-అడిక్షన్ సెంటర్ ను విశాఖ కేంద్ర కారాగారంలో ఏర్పాటు చేసే ప్రతిపాదనలపై సాధ్యా సాధ్యాలను పరిశీలిస్తున్నామని మంత్రి తెలియజేశారు.

==============================

ఆంధ్రప్రదేశ్, యానాంల మీదుగా దిగువ ట్రోపో ఆవరణంలో పశ్చిమ గాలులు వీస్తున్నాయని వీటి ప్రభావంతో రాష్ట్రంలో కొన్ని చోట్ల తేలిక పాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురుస్తాయని అమరావతిలోని భారత వాతావరణ కేంద్ర అధికారి తెలియజేస్తూ.....

(వాయిస్ 30 సెకన్లు)

==============================

శాసన సభ్యుల కోటాలో శాసనమండలిలో ఖాళీ ఏర్పడిన రెండు ఎమ్మెల్సీ స్థానాలకు సంబంధించిన ఎన్నికల నామినేషన్ ప్రక్రియ ఈరోజు అసెంబ్లీ కమిటీ హాల్లో జరిగింది. సార్వత్రిక ఎన్నికలకు ముందు ఎమ్మెల్సీలుగా ఉన్న సి.రామచంద్రయ్య, ఇక్బాల్ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి తెలుగుదేశం పార్టీలో చేరారు. వారిలో ఇక్బాల్ ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేయగా, రామచంద్రయ్యపై అనర్హత వేటు పడింది. దీంతో ఖాళీ అయిన రెండు ఎమ్మెల్సీ స్థానాలకు ఈనెల 12వ తేదీన ఉపఎన్నిక జరగనుంది. ఈ రెండు స్థానాలకు జనసేన పార్టీ తరఫున పిడుగు హరి ప్రసాద్, తెలుగుదేశం పార్టీ తరఫున సి.రామచంద్రయ్య ఎమ్మెల్సీ అభ్యర్థులుగా నామినేషన్లు దాఖలు చేశారు.

==============================

విశాఖపట్నం తాగునీటి అవసరాలను తీరుస్తున్న తాటిపూడి రిజర్వాయర్ అభివృద్ధికి కృషి చేస్తానని రాష్ట్ర సూక్ష్మ, మధ్యతరహా పరిశ్రమల శాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. విజయనగరం జిల్లా గంట్యాడ మండలంలోని గొర్రిపాటి బుచ్చి అప్పారావు తాటిపూడి రిజర్వాయర్ నుంచి సాగునీటిని మంత్రి ఈరోజు విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, తాటిపూడి రిజర్వాయర్ శివారు భూములకు కూడా సాగునీరు అందించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. గంట్యాడ, జామి, ఎస్.కోట మండలాల్లోని 35 గ్రామాల్లో సుమారు 15 వేల 365 ఎకరాలకు సాగునీరు అందించే తాటిపూడి రిజర్వాయర్ ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేస్తుందన్నారు. విశాఖపట్నం తాగునీటి అవసరాలను తీరుస్తున్న ఈ రిజర్వాయర్ అభివృద్ధికి విశాఖ నుంచి రావాల్సిన నిధుల కోసం ప్రయత్నం చేస్తామన్నారు. పూర్తి భద్రతా ప్రమాణాలతో పర్యాటకుల పడవ ప్రయాణాల్ని పునరుద్ధరించి, ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తామని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ హామీ ఇచ్చారు.

==============================

ఆదాయపన్ను చట్టంపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని విజయవాడ రైల్వే డివిజన్ మేనేజర్ నరేంద్ర ఆనందరావు పాటిల్ అన్నారు. విజయవాడ రైల్వే ఆడిటోరియంలో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఆదాయపన్ను అధికారులు అవగహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖలకు సంబంధించిన ఉద్యోగులకు ఆదాయపన్ను రిటర్న్స్ దాఖలు చేయడంలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా ఉండేందుకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నరేంద్ర ఆనందరావు పాటిల్ మాట్లాడుతూ... పన్ను చెల్లింపులపై అపోహలు, అనుమానాలు ఉంటాయని, వాటిని నివృత్తి చేసుకునేందుకు ఆదాయపు పన్ను శాఖ ఉన్నతాధికారుల ఆధ్వర్యంలో అవగహన సదస్సు ఏర్పాటు చేశామన్నారు. పన్నులు చెల్లించడం వల్ల ఎన్నో ఉపయోగాలు ఉంటాయని, ఉద్యోగులు ఆదాయపన్ను రిటర్న్స్ ఫైల్ చేయడం, టీడీఎస్‌తో లావాదేవీలు నిర్వహించేందుకు వాటిపై సంపూర్ణ అవగాహన ఉండాలన్నారు.

==============================

ఆంధ్రప్రదేశ్ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ పరిధిలోని వినియోగదారులు విద్యుత్ బకాయిలను ఆంధ్రప్రదేశ్ సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ (ఏపి ఎస్ పిడిసిఎల్) మొబైల్ యాప్ లేదా వెబ్ సైట్ ద్వారానే చెల్లించాలని

ఎపిఎస్పిడిసిఎల్ ఛైర్మన్ కె. సంతోష రావు ఈరోజు ఒక ప్రకటనలో తెలిపారు. www.apspdcl.in వెబ్ సైట్ ద్వారా డెస్క్ కు అనుసంధానమైన యూపిఐ యాప్స్ నుంచి బకాయిలు చెల్లించవచ్చని వివరించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =